విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 07, జనవరి 2024

జీతాలు పెంచకపోతే గడ్డితిని బతకాల సీఎంసారూ...!

నంద్యాల: ఆకులు తింటూ నిరసన తెలుపుతూ..

డోన్ : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆకులు తింటూ నిరసన తెలుపుతూ..

విశాలాంధ్ర-డోన్: పెరిగినధరలకు అనుగుణంగా జీతాలు పెంచక పోతే గడ్డితిని బతకాల సీఎం సారూ.. అంటూ ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గం అధ్యక్షులు పుల్లయ్య అన్నారు. శనివారం మున్సిప ల్ కార్మికుల 4 రోజు నిరవధిక సమ్మెలో పుల్లయ్య,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మున్సిపాలిటీలలో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్సో ర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి ముఖ్యమంత్రి అయిన తర్వాత వారు ఇచ్చిన వాగ్దానాన్ని మరచారని, మడమతి ప్పారని వారు ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో కొంతమంది కార్మికులను దినసరి కూలీలుగా తీసుకున్నారని వారిని రెగ్యులర్ కార్మికులతో సమానంగా పరిగణించి వారికి కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్ లో పనిచేస్తున్న కార్మికులు గత దశాబ్ద కాలంగా వేతనాలు పెరగక కనీసం ఇంటిఅద్దెలు చెల్లించలేని దీనస్థితిలో బతుకుతున్నారని వారు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులు పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఉద్యోగం కల్పించి, ఆకుటుంబ భరోసాకు రూ.30 లక్షలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ కింద ప్రకటించిన మొత్తాన్ని ప్రతినెల వారి ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు .మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదు కాబట్టి, కార్మికులందరికీ ప క్కాగృహాలు నిర్మించాలని వారు కోరారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేకుండా ఉన్నారని ఏదైనా అనా రోగ్యం చెందితే కార్మికులు దీనస్థితిలో వైద్యం కూడా చేయించు కోలేని పరిస్థితిలో ఉన్నారని వారికి ఈఎస్ఐ సౌకర్యాన్ని తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామ ని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌస్ ,సంజీవులు, చంద్ర, రంగన్న, శిరీష్, లక్ష్మీరెడ్డి, హరికృష్ణ, మాలతి, అజయ్, సురేష్, రవి, ఇంతియాజ్, హీర లాల్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. నంద్యాల మున్సిపల్ కార్యాలయం దగ్గర ఉన్న టెంట్లో మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు ఆకులు తింటూ నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమానికి ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ నాయకులు మౌలానా అబ్దుల్‌సలాం, అర్షద్, అబ్బాస్‌లు మద్దతు తెలిపారని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కె.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమం లో ఓబులేసు, శివరాముడు, మస్తానయ్య, మద్దయ్య మద్దిలేటీతో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని పెంచడంలో క్రీడాకారులు కీలకం

విశాలాంధ్ర-పాణ్యం: దేశఖ్యాతిని పెంచడంలో క్రీడాకారులు ముందువరుసలో ఉంటారని ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మిం టన్ క్రీడాకారుడు, అర్జునఅవార్డు గ్రహీత చేతన్ ఆనంద్ పేర్కొన్నారు. ఆర్‌జీయం ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం క్రీడాదినోత్సవం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేతన్‌ఆనంద్ హాజరై క్రీడలు ప్రారంభించారు. అనంతరం క్రీడా కారుల వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని పాఠ శాల యాజమాన్యాన్ని కోరారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలు ఎంచుకొని వాటిలో నైపుణ్యం సంపాదించాలన్నారు. క్రీడాకారులు ఆరోగ్యంగా ఉండాలంటే మంచిఆహారం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్‌తో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. పాఠశాల ఎండి ఎం.శివరాం మాట్లాడుతూ పాఠశాలలో సింథటిక్ క్రీడామైదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న దృక్పథంతో రాయలసీమలో మొట్టమొదటిసారిగా రెసొనేన్స్‌సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్నత ప్రమాణాలతో విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టు కున్నాయి. క్రీడల్లో విజేతలకు చేతన్ ఆనంద్ ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.ప్రిన్సిపల్ గాయత్రి, ఆర్జీఎం కళాశాల డీన్ డా.అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నంద్యాల: నంద్యాలకు విచ్చేసిన ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ చేతన్ ఆనంద్ కు రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షులు వంశీధర్, నంది అకాడమీ కోచ్ నాగార్జున, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.

విశాలాంధ్ర ఎఫెక్ట్ -ఎట్టకేలకు ఫించన్ మంజూరు

విశాలాంధ్ర-అవుకు: మండల కేంద్రమైన అవుకుకు చెందిన వికలాంగుడైన వడ్డే వెంకటసుబ్బయ్యకు ఎట్టకేలకు పింఛన్ రావడంతో హర్షం వ్యక్తం చేశారు. గత జూన్ నెల 22న 'సారు...పింఛన్ ఇవ్వండి' అనే శీర్షికన విశాలాంధ్రలో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు వడ్డే వెంకటసుబ్బయ్యకు పింఛన్ మంజూరు చేశారు. శనివారం పట్టణం లోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో నూతన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమానికి బనగానపల్లె శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వడ్డే వెంకటసుబ్బయ్యకు వికలాంగుల పింఛన్ మంజూరు కావడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీపీచల్లా రాజశేఖర్ రెడ్డిలు వడ్డే వెంకటసుబ్బయ్యకు వికలాంగుల పింఛన్ రూ.3 వేలలను అందించారు. ఈసందర్భంగా వడ్డే వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వికలాంగుడనైనా తనకు పదేళ్లుగా పింఛన్ వచ్చేదని రెండేళ్లుగా పింఛన్ రావడం లేదని, శనివారం మరల పింఛన్ వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. అందుకు సహకరించిన విశాలాంధ్రకు, నాయకులు,అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

క్రీడల్లో పోటీతత్వం ప్రదర్శించాలి

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: గ్రామీణ స్థాయి నుండి పోటీతత్వంతో క్రీడల్లో రాణించాలని వైసీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక గ్రామసచివాలయంలో ఈనెల 10న మండలస్థాయి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు అందజేశారు. క్రీడలను ప్రోత్సహించడం, క్రీడాకారులను తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తూ ఉందన్నారు. ఈఅవకాశాన్ని గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సర్పంచ్ ఓబులేసు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-అవుకు: మండల కేంద్రమైన అవుకులోని అగ్రహారం వీధికి చెందిన పురోహితుడు అల్వకొండ మల్లికార్జున శర్మ (46) గత కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధ పడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ శాసనసభ్యుడు, సీనియర్ నాయకులు బిజ్జం పార్థసారథిరెడ్డి అందించిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని చిన్నపల్లికి చెందిన మారం భాస్కర్‌రెడ్డి మృతుడి సోదరుడు ఆల్వకొండ శంకర్ శర్మకు అందించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే గూడాల ప్రతాప్ రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.బీఎస్సి, బీఈడీ, ఎంఏ తెలుగు విద్యను అభ్యసించిన మల్లికార్జునశర్మ ఉన్నతమైన చదువులు చదివిన ఉద్యోగం రాలేదని మనోవేదనతో బాధపడేవాడని, పౌరోహితం చేస్తూ జీవనం సాగించేవాడు అని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత వివాహం చేసుకోవాలని తలచి వివాహం కూడా చేసుకోలేదని ఉద్యోగం రాలేదన్న తీవ్ర మనోవేదనతో ఆరోగ్యం క్షమించిందని మృతుడి సోదరుడు శంకర్ శర్మ తెలిపారు.

మండలానికి 67 పింఛన్లు మంజూరు

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: మండలానికి నూతనంగా 67 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. ఆదివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్ లో పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,981 మొత్తం పింఛన్లు ఉండగా రూ.1,17,63,000 నగదు ప్రభుత్వం విడుదల చేసిందని స్పష్టం చేశారు.

ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక వైసీపీని వీడుతున్న నేతలు

విశాలాంధ్ర -బనగానపల్లె: ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక వైసీపీ ఎమ్మెల్యేలు,ఎంపీలు ఆ పార్టీని వీడుతున్నారనీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాజీ శాసన సభ్యులు బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూనాలుగేన్నారెళ్ల వైసీపీ అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని స్వస్తి పలికే సమయం ఆసన్నమైనది, సైకో జగన్ రెడ్డిని తుదిముట్టించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సైకో జగన్ ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేకుండా పోయింది, అరాచకాలు మితి మీరిపోయాయి, ప్రభుత్వ, ప్రైవేట్ భూములు అని లేకుండా వైసిపి నాయకులు కబ్జాలు చేస్తున్నారు అని ఆరోపించారు. నాడు అన్న ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కొసం 'రా..కదిలి రా' అనే నినాదంతో పిలుపునిచ్చారు. నేడు తెలుగు వారి రక్షణ కొసం చంద్రబాబు నాయుడు అదే నినాదంతో మన ముందుకు వస్తున్నారు.బీసీలు బలహీనులు కాదు బలవంతులు అనే నినాదమే తెలుగుదేశం సిద్దాంతం, లక్షల మంది బీసీలను నాయకులను చేసిన పార్టీ తెలుగుదేశం, వైసీపీప్రభుత్వంలో బీసీలు నిర్లక్షనికి గురి అవుతున్నారు అంతే కాకుండా వైసీపీ నాయకుల చేతిలో 76 మంది బీసీలు హత్యకు గురుయ్యారన్నారు.వేలమందిపై దౌర్జన్యాలు జరిగాయని గుర్తు చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం జరగాలి అంటే తెలుగుదేశం తోనే సాధ్యమని పేర్కొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : చెంచు గూడెంలలో నివసిస్తున్న గిరిజనుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహసీల్దార్ హరినాథ్‌రావులు పేర్కొన్నారు. మండలంలోని అహెూబిలం గ్రామపంచాయతీ పరిధిలోని చెంచుగూడెంలో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ద్వారా గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. గిరిజనులు అందరికీ పక్కా ఇల్లు, ప్రతి ఇంటికి మంచినీటి కొలాయి, విద్యుత్తు కనెక్షన్, గ్రామానికి రహదారుల సౌకర్యం, అందరికీ నాణ్యమైన విద్య, వైద్య సదుపాయం నైపుణ్య వికాసం పౌష్టికాహారం తదితర వాటిని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ నాయక్, పంచాయతీ రాజ్ ఏఈ. కమాల్‌సాహెబ్, ఉపాధి ఏపీఓ గణేష్, పంచాయతీ కార్య దర్శి నరసింహ, సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుద్ధ్య ఒప్పంద కార్మికుల సమ్మె ఉధృతం

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : మునిసిపల్ కార్మికులు సమ్మెను శనివారం మరింత ఉధృతం చేసినట్లు ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి యస్.అహమ్మద్ హుస్సేన్, మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకులు బిసన్న సీపీఐ తాలూకా నాయకులు టి.ప్రతాప్‌లు పేర్కొన్నారు. వారికి ఏపీ మీడియా ఫెడ రేషన్ నాయకుల బృందం మద్దతు తెలిపారు. ఆత్మకూరులో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద గల శిబిరం ఎదుట కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ పారిశుద్ధ కాంట్రాక్టు కార్మికులు నాగరాజు, దొరస్వామి, బాబు, ఏఐటీయూసీ నాయకులు, లల్లు, షేక్షా, మాబాష, సయ్యద్, చాంద్, పుల్లయ్య, ఖాదర్, అలిషేర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు ఊపిరి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: శ్రీశైలం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో చేరికలు ప్రారంభమయ్యాయి.ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి ,జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఆధ్వర్యంలో పట్టణంలో కొన్ని కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి లక్ష్మీ నరసింహా కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. వీరిలో అబ్దుల్ రెహమాన్, సయ్యద్ జలాన్ భాష, దిల్ ఫ్రూట్స్ సలాం భాష, అహ్మాద్ భాష, షేక్ రెహ్మాన్లు పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది ఎమ్మెల్యేలు పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకి టచ్‌లో ఉన్నారని త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్నారు.

పటిష్ట నిఘాకు చర్యలు తీసుకోండి-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-నంద్యాల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్ని కల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట నిఘాకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, నగదు ఇతర గిఫ్ట్ పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘాకేంద్రాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించేందుకు బృందాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు అనుమానిత వ్యక్తులు, వాహనాలను క్షుణంగా పరిశీలించాలని, ఎలాంటి అక్రమ రవాణా చర్యలకు పాల్పడినట్లు అనుమానం వస్తే సంబంధిత వ్యక్తులను విచారించి, అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయితే తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలు ఆదేశించారు.

టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్ : రానున్న ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని టీడీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ప్రతి కుటుంబానికి వరమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రవేశపెట్టిన పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్‌రెడ్డి, వంగాల శివరాంరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబుల్లాపురం బాషా, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కలిముల్లా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి నాగుర్ ఖాన్, కొప్పరపు రవి ప్రసాద్, సతీష్, రమేష్ గౌడ్, కేశవరెడ్డి , శేఖర్ యువ నాయకులు, అశోక్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు -నేడు కార్యక్రమం పలు రాష్ట్రాలకు ఆదర్శం

విశాలాంధ్ర-నంద్యాల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు- నేడు కార్యక్రమం దేశంలోనే పలు రాష్ట్రాలకు ఆదర్శనీయమని అలాగే రాష్ట్రంలో ఉర్దూ భాషను రెండవ భాషగా ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమని ప్రథమ్ ప్రాజెక్ట్ కేంద్ర కమిటీ సభ్యులు బనేశ్వర్ సింగ్ వెల్లడించారు. శనివారం అయ్యలూరులోని మండల పరిషత్ ప్రాధమి కోన్నత ఉర్దూ పాఠశాలను ప్రథమ్ ప్రాజెక్టు కేంద్ర కమిటీ సభ్యులు రాజస్థాన్ నివాసి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శిం చారు. ఆయన వెంట ప్రథమ్ ప్రాజెక్టు రాష్ట్ర కో-ఆర్డీనెటర్ ఎండి. ఇమ్రాన్, కర్నూలు జిల్లా కొ. ఆ-ర్డీనెటర్ తన్వీర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు బన్వీర్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేపట్టిన 'నాడు-నేడు' అంశాలు తెలుసుకున్నారు. మొదటి ఫేస్‌లోనే తమ ఉర్దూ పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దీ, మౌలిక సదుపాయాలు సమకూర్చడం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాల ఆవరణలో బనెశ్వర్ సింగ్, ఇమ్రాన్, చేతుల మీదుగా మొ క్కలు నాటడంతో భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం బనెశ్వర్ సింగ్‌ను ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అజీజ్ ఘనంగా సత్కరించి సన్మానించారు.

ప్రజలకు అసౌకర్యాలు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్: మండలంలోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ త్రాగునీరు రోడ్డు సౌకర్యాలు విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు, గ్రామాలలోని ప్రజలకు కావలసిన ఆరోగ్య విషయంలో, అంగన్వాడి బదులలో ఆహార పంపిణీ, చెరువులకు నీటి సదుపాయం వంటి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ఏ లోటు లేకుండా సకల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాడని ఆయనకు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగాలు తమ వంతు చేదోడుగా తోడ్పాటు అందించాలని తెలిపారు. అర్డబ్లు ఎస్ ఏ ఈ సతీష్, అగ్రికల్చర్ ఏ ఇ షఫీ, ఐసీడీఎస్ అధికారి షంశాద్ బేగం,ఎం ఈ ఓ ప్రభాకర్, హార్టికల్చర్ అధికారిని కళ్యాణి, కొత్త బురుజు చిన్న మల్కాపురం పి హెచ్ సి వైద్యులు చెన్న కేశవులు, రాం భూపాల్, పంచాయతీ రాజ్ ఏ ఇ నారాయణ,అంగన్వాడి సూపర్ వైజర్లు శోభారాణి, అరుణకుమారి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

వికాషిత్ భారత్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - శిరివెళ్ళ : మండల కేంద్రమైన శిరివెళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణములో శనివారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ లక్కాకుల సాలమ్మచంద్ర అధ్యక్షతన ఎంపీడీవో సుబ్రమణ్యం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యవసాయాధికారి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయశాఖలో అమలుచేస్తున్న పిఎం కిసాన్ సమ్మన్‌నిధి,మట్టి పరీక్షలు, నానో యూరియా,నానో డి. ఎ.పి వాడకం గురించి ,ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు.రైతు సోదరులు 2023-24 రబి సీజన్లో వేసిన జొన్న పంటను రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 5వేల ఏకరాల్లో జొన్న పంటను సాగు చేశారని,సాగు చేసిన జొన్న పంటను సాగు చేసి ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జొన్నలు సివిల్ సప్లైస్ ఆధ్వర్యంలో ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధర ఒక క్వింటాల్ రూ.3,180లతో కొనుగోలు చేయటం జరుగుతుందని తెలిపారు.

రైతన్నల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రైతన్నల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. శనివారం దొర్నిపాడు మండల కేంద్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణ కార్యక్రమంలో వారు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం వైసీపీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష మంది జన సమీకరణే లక్ష్యం

విశాలాంధ్ర -చాగలమర్రి: ఈనెల 9న ఆళ్లగడ్డకు తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ము ఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభను విజ య వంతం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కోరారు. శనివారం స్థానిక పాత బస్టాండ్ కాలనీలోని మహబూబ్ టాకీస్ ఆవరణంలో మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నామన్నారు. ఈ సభకు సుమారు లక్ష మంది జన సమీకరణ చేస్తున్నామన్నారు. మండలం నుంచి నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు భార్గవ్‌రామ్, భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి, అబ్దుర్వార్ ముక్తియార్, టీడీపీ మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌భాష, టిఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ దుర్మార్గపు పరిపాలనకు ముగింపు పలుకుదాం

విశాలాంధ్ర-నంద్యాల: సీఎం జగన్ దుర్మార్గపు పరిపాలనకు ముగింపు పలుకుదామని మాజీ మంత్రి, నంద్యాల నియోజకవర్గ ఇంచార్జి ఎన్ ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. రా కదలిరా తెలుగుదేశం పిలుస్తోంది కార్యక్రమంపై నంద్యాల నియోజకవర్గ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలతో పెద్ద ఎత్తున నిర్వహించిన సమావేశంలో మాజీ విత్తనాభివృద్ధి శాఖ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబాన్, రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, జిల్లెల్ల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, అబ్దుర్వార్ పోతురాజు రవి కుమార్, న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఇలియస్, రైతు సంఘం నాయకులు గుంటు పల్లి హరిబాబు, పట్టణ అధ్యక్షులు మనియర్ ఖలీల్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి దూదేకుల జైనాబి, విజయగౌరీ, మాజీ కౌన్సిలర్ మిద్దె హుస్సేనీ, జనసేన నాయకులు చందు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ రా కదలి రా తెలుగుదేశం పిలుస్తుంది అనే నినాదంతో టీడీపీ,జనసేన ఉమ్మడిగా 9న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగే బహిరంగ సభకు చంద్రబాబు హాజరవుతున్నారని, లక్ష మందితో జరిగే ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలునిచ్చారు. ఈసభ ద్వారా ఎన్నికల శంఖారావం పూరించి జగన్ దుర్మార్గపు పరిపాలనకు ముగింపు పలకబోతున్నామన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త "రా కదలి రా" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

చెంచు గూడేల్లో మహాభియాన్

విశాలాంధ్ర -రుద్రవరం : మండల పరిధిలోని చిన్నయ్య స్వామి చెంచు గూడెం, హరి నగరం గ్రామాలలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మలు నిర్వహించారు.శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిఇంటి వద్దకు వెళ్లి గ్రామాలకు అవసరమైన వసతులను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో ఉండాల్సిన కనీస వసతులైన తాగునీటి, పక్కాగృహాలు రహదారులు, విద్య, విద్యుత్, వైద్య, పౌష్టికాహారం,జీవనోపాదుల గురించి వివరంగా ప్రజలకు తెలియజేసి వీటిని పరిష్కరించేందుకు ప్రణాళికలను తయారు చేసి అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి వారు సూచించారు.

రా కదలిరా సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-నందికొట్కూరు: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈ నెల 9న తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యం లో జరిగే రా.. కదలిరాకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని అల్లూరులోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలు, రైతులు బీసీలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. రా..కదలిరా కార్యక్రమానికి నంద్యాల పార్లమెంటు పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నందికొట్కూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుండం రమణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, పలుచని మహేశ్వర్‌రెడ్డి, జమీల్, రసూల్‌ఖాన్, నాగలక్ష్మయ్య, బ్రహ్మానందరెడ్డిలు పాల్గొన్నారు.

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక :

నియోజకవర్గ పరిధిలోని తరిగోపుల గ్రామ పంచాయతీ మజార రామ సముద్రం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు నందికొట్కూరు నియోజక వర్గ టీడీపీ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి సమక్షంలో అల్లూరు గ్రామంలో మాండ్ర స్వగృహంలో శనివారం తరిగోపుల గ్రామ టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, దొరబాబురెడ్డి, కోట్ల నారాయణ రెడ్డి, నాగార్జునరెడ్డిల ఆధ్వర్యంలో వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు.వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారు పుట్టరంగస్వామి, వెంకట రమణ, శేఖర్, ధనుంజయ, సాయికుమార్, చిన్నఎల్లయ్య, కిషోర్, పెద్ద ఎల్లయ్య, రాజు, తరుణ్, హరికృష్ణ, రమణ, ఫారూక్ బాషా, అల్తాఫ్, నాగయ్య, పెద్ద చెంచులు, దేవదాసు, మద్దిలేటి, బిచ్చన్న, బాలసంజన్న, వెంకటేశ్వర్లు, పెద్ద రంగస్వామి, మౌలాలి, రమేష్ వీరందరికీ గౌరు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పరిమితికి మించి వాహనాల్లో తీసుకెళ్లితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను, పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లితే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్సై వెంకటరెడ్డి హెచ్చరించారు. పట్టణంలో శనివారం టౌన్ఎస్సై వెంకటరెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్‌పిల్లలను ఎక్కించుకొని ఓవర్ లోడ్ తో వెళుతున్న ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పరిమితికిమించి ఆటోల్లో ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులను ఎక్కించుకొని వెళ్లరాదని హెచ్చరించారు. రెండో పర్యాయం కూడా ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే ఆటోలను సీజ్ చేస్తామని ఎస్ఐ వెంకటరెడ్డి హెచ్చరించారు.

అందరికీ సముచిత స్థానం కల్పిస్తాం

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి పార్టీలో తగిన సముచిత స్థానం కల్పిస్తా మని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బెలుంకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు బీసీ ఆధ్వర్యంలో శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గ్రామ టీడీపీ నాయకులు రాఘవరెడ్డి,మహేష్ రెడ్డి అహ్మద్, హుస్సేనయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు కప్పి ఆ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మూలె రామేశ్వర్ రెడ్డి, కోటపాడు శివ రామిరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులు

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు మాణిక్యం అధ్యక్షత వహించారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్ని రోజులైనా సమ్మె చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదిలేటి, నగర కార్యదర్శి జి చంద్ర శేఖర్ లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు. మున్సిపల్ కార్మికులు పనిచేయకపోతే రాష్ట్రం మొత్తం మున్సిపాలిటీలు కంపు కొడుతాయని వారు తెలిపారు. ఔట్సోర్సింగ్,కాంటాక్ట్, టైం స్కేల్ వర్కర్స్ ని పర్మినెంట్ చేయాలని వారు కోరారు. దేశంలో సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం 26వేల రూపాయలు అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఏసన్న,సవారి, నాగేంద్ర, అయ్యన్న, లింగన్న, రాధా, మేరీలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు కల.... కలగానే మిగ లేనా ?

- దశాబ్దాలు గడిచిన పూర్తిగా రహదారి పనులు
- వాటాలలోల్లితో నిలిచిపోయిన పనులు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు

అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారి

విశాలాంధ్ర - కల్లూరు : బీటీ రోడ్డు కల కలగానే మిగిలి దశాబ్దాలుగా ఎరకత్వ గ్రామ ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్న పట్టించుకునే నాధుడే కరువయాడని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు మండల పరిధిలోని ఎరకత్వ గ్రామానికి వెళ్లే రహదారి దాదాపు 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు గత పాలకులు ఒక కోటి 58 లక్షల నిధులు వేచించారు. అయితే కాంట్రాక్టర్లు వాటాల లొల్లితో పనులు కమిషన్ల కక్కుర్తి పడి పనులు ఒప్పందం చేసుకొని దశాబ్దాలు గడుస్తున్నా పనులు పూర్తిగా ని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి వెళ్లే ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న సంబంధిత అధికారులు చుట్టం చూపులా వచ్చి వెళ్లడం తప్ప పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో అధికార పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు రహదారి పనులను సబ్ కాంట్రాక్ట్ తీసుకొని పనులు ప్రారంభించేందుకు నామ్కే వాస్తిగా ప్రారంభించి తనకు లాభం రావడం లేదంటూ నిర్దాక్షిణ్యంగా రహదారి పనులను నిలిపివేసి పనులపై మక్కువ చూపకపోవడంతో టెండర్ పొందిన కాంట్రాక్టర్ మరో సబ్ కాంట్రాక్టర్కు పనులు అప్పగించారు. పనులు ప్రారంభం రోజే మోస్తారు వర్షం కురవడంతో వచ్చిన కాంట్రాక్టర్ కూడా ఈ రహదారి పనులు చేయడం తనకు ఎలాంటి లాభం చేకూరాలని ప్రారంభ దశలోనే పనులను వదిలి వెళ్ళిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలా వచ్చిన కాంట్రాక్టర్లు టెండర్ వేసిన కాంట్రాక్టర్లు కేవలం వారి స్వార్థం కోసమే రోడ్డు పనులు ప్రారంభం చేయడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన గ్రామం నుండి రాకపోకలు చేయాలంటే తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని ముందు వాహనం వెళితే రెండో వాహనం కనీసం మేర దూరం వెళ్ళాక తప్పడం లేదని దుమ్ము దూళి దట్టంగాలేస్తున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇటీవల రహదారి ఎస్సీ ని గ్రామ ప్రజలు కలిసి తమ గ్రామానికి రహదారి పనులు ప్రారంభించి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని వేడుకున్నట్లు తెలిపారు. ఎస్సీ స్పందనతో స్పందించిన కాంట్రాక్టర్లు రహదారిపై గ్రావెల్ కంకర ను వేసి పనులు నిలిపేశారు. ఈ గ్రావెల్ పై ద్విచక్ర వాహనదారులు వెళ్లేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేసే పరిస్థితిలు దాపరించాయని వాహనదారులు మండిపడుతున్నారు. గ్రామంలోని వృద్ధులు గర్భిణీ స్త్రీలకు ఏదైనా అనారోగ్యం గురైనప్పుడు గ్రామం నుండి ఉలిందకొండ గ్రామానికి వెళ్లే వరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులు అనేక హామీలు ఇచ్చి దశాబ్దాలు గడిచి పాలకులు మారిన నేటికీ మా గ్రామ రహదారి దుస్థితి మారడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన రహదారి పనులను సకాలంలో పూర్తిచేసి గ్రామానికి రాకపోకలు సజావుగా జరిగేలా చూడాలని వేడుకొనుచున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

విశాలాంధ్ర -పత్తికొండ: పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ఎస్టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీ యూ) ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలు నగరంలో వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వజ్రోత్సవాలు పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమం పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాతశాల ఆవరణంలో ఎంఈఓ మస్తాన్‌వలితో కలిసి ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్ధన్, రాష్ట్ర అదనపు కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్స్ సత్యనారాయణ, నారాయణ, నాయకులు వీర చంద్ర యాదవ్, బలరాం, మారుతి, మౌలేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాబుతోనే గ్యారెంటీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టీడీపీ అధినేత చంద్రబాబుతోనే గ్యారెంటీ అని మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం మండల పరిధిలోని బాపులదొడ్డి, గవిగట్టు గ్రామాలలో టీడీపీ నేతలు నర్సిరెడ్డి, బసన్నల ఆధ్వర్యంలో భవిష్యత్తుకు బాబు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి, రమాకాంతరెడ్డిలతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలు గురించి, వాటి లబ్ది గురించి వివరించారు. మహాశక్తి ద్వారా తల్లికి వందనం పేరుతో చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు పైబడిన స్త్రీలకు నెల రూ. 1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు సాయం అందిస్తారని తెలిపారు. యువగళం పేరుతో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి రక్షిత మంచినీటి పథకం, పేదలను సంపన్నులను చేసే పథకాలను చంద్రబాబు అమలు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ ఈరన్న, మీ సేవ ఆంజనేయులు, తలారి అంజీ, వీరేష్ గౌడ్, పీకలబెట్ట ఈరన్న, నాగరాజు, నర్సింహులు, బంగారయ్య, కరెన్న, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా సరికాదు

విశాలాంధ్ర -పెద్దకడబూరు : వేతనాలు పెంచాలని కోరుతూ 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించటం సరికాదని ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జిల్లా అధ్యక్షులు అల్వాల పెద్ద యల్లప్ప అన్నారు. శనివారం పెద్దకడబూరులో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లు ఏవైతే న్యాయపరంగా ఉన్నాయో వాటిని పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, న్యాయస్థానం తీర్పు అమలు, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చటం తదితర న్యాయపరమైన డిమాండ్ల కోసం సమ్మె చేసిన అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించడమేనని అన్నారు. ఇది ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం ఆరోపించారు. అంగన్వాడీలతో చర్చలు జరిపి వారికి న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యవసరాల ధరలకు, వారికి ఇస్తున్న జీతానికి పొంతన లేదన్నారు. ఆకలి మంటలతో ఊడిగం చేస్తున్న అంగన్వాడీలకు న్యాయం చేయాలని కోరారు. చర్చలతో సమస్య పరిష్కరించాలి తప్ప ఇలా పిచ్చుకపై ఎస్మా బ్రహ్మాస్త్రం వేయటం సరికాదన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, మేధావులు, పాలకులు, అధికారులు పునరాలోచించాలన్నారు.

జిల్లా మహిళా కారాగారాల సందర్శన

విశాలాంధ్ర -కర్నూలు లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి హెచ్. వెంకట నాగ శ్రీనివాస రావు మరియు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎస్.మనోహరు పంచలింగాల గ్రామం నందు గల జిల్లా జైలును మరియు మహిళా జైలును సందర్శించారు. అక్కడ ఉన్నటువంటి ఖైదీల వివరాలను సంబందిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు మరియు వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలతో మాట్లాడటానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. ఉన్నత న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా న్యాయ సేవధికారసంస్థ కార్యదర్శి శ్రీనివాస రావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి హెచ్. వెంకట నాగ శ్రీనివాస రావు , చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎస్.మనోహరు, జైలు పర్యవేక్షణ అధికారులు, పాల్గొన్నారు.

పారా లీగల్ వాలెంటీర్లకు శిక్షణ తరగతులు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా కోర్ట్ కర్నూలు నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎస్.మనోహరు, పారాలీగల్ వాలెంటీర్లకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం నందు పారా లీగల్ వాలెంటీర్లకు ఫ్యామిలి లా, గృహహింస చట్టం, విడాకుల చట్టం, మధ్యవర్తిత్వం, భరణం, ఫ్రీ లీగల్ అయిడ్, లీగల్ సర్విస్ అథారిటీ ఆక్ట్ 1987, న్యాయ విజ్ఞాన సదస్సుల యొక్క ప్రాముఖ్యత, లీగల్ అయిడ్ టు ప్రకృతి వైపరీత్యాలకు న్యాయ సేవల పథకం మున్నగు చట్టాల గురించి పారా లీగల్ వాలెంటీర్లలకు అవగాహన కల్పించారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దాం..!

విశాలాంధ్ర- ఆదోని రూరల్ : బిజెపి పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేస్తామని, బిజెపి కార్యకర్తల పరిచయ వేదికలో శనివారం స్థానిక బిజెపి నూతన కార్యాలయంలో రమేష్ యాదవ్,జిల్లా అధ్యక్షులు కూనిగిరి నీలకంఠ తెలిపారు. విజయవాడ నగరంలోని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో రమేష్ యాదవ్ చేరికతో ఆదోని నియోజకవర్గం లో బిజెపి పార్టీకి కొత్త కల వచ్చిందన్నారు. తన శక్తికి మించి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని రమేష్ యాదవ్ కార్యకర్తలకు పటిష్టమైన హామీని విలువైన సందేశాన్ని ఇచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయం వైపు దూసుకెళ్లే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. ముందుగా రమేష్ యాదవ్కు శాలువా కప్పి గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు పట్టణ అధ్యక్షులు జిందా సాయికుమార్ ఉపేంద్ర కుమార్ విజయ్ కృష్ణ రమాకాంత్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర -పత్తికొండ: పేదలు నివాసం ఉంటున్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక చదువుల రామయ్య భవనం నుండి పట్టణ పుర వీధుల గుండా ర్యాలీ చేపట్టి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ గత 15 ఏళ్ల కిందట భూ పోరాటాలు చేపట్టి, సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సీపీఐ పంపిణీ చేసిన స్థలాలలో పేదలు గుడిసెలు వేసుకొని జీవనం గడుపుతున్నారని, పేదల కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జననివాసాలు లేని చోట విచ్చలవిడిగా సిసి రోడ్లు వేసి, జనం నివాసం ఉండే ప్రాంతాలలో సిసి రోడ్లు వేయకపోవడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వ భూము లలో వెంచర్లు వేసుకునేందుకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీకే ఆదినారాయణ రెడ్డి నగర్, పార్వతి కొండ కొట్టాల కాలనీ, దిద్ది చేను కొట్టాల, నల్లగుట్ట కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, మండల కార్యదర్శి డి.రాజాసాహెబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, సురేంద్ర కుమార్, ఏఐటియుసి తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న తదితరులున్నారు.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో శిబిరం లో నిద్రపోతు అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 26 వ రోజుకు చేరుకుంది. నిద్రపోతున్న ప్రభుత్వం నిద్రలేచి మా సమస్యలు పరిష్కరించాలని కర్నూలు ధర్నా చౌక్ శిబిరంలో అంగన్వాడీలు నిద్రపోతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.ఏఐటీయూసీ నగర కార్యదర్శి జీ చంద్రశేఖర్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్ జిల్లా గౌరవాధ్యక్షులు పి నిర్మల, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, సిఐటియు జిల్లా నాయకులు యం గోపాల్ మాట్లాడుతూ గత 25 రోజులుగా రాష్ట్రంలో లక్షకు పైగా అంగన్వాడీలు తమ వేతనాల పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాజీటీ 5 లక్షలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని న్యాయబద్ధంగా సమ్మె నోటీసు ఇచ్చి నిరసనలు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వానికి ఏ మాత్రం కూడా చెలించకుండా మహిళలు అనే కనికరం చూడకుండా నిర్దాక్షిణ్యంగా సమ్మె ను విచ్చిన్నం చేయడానికి అనేక అస్త్ర శస్త్ర ప్రయోగాలు చేసి నిర్బంధాలు కొనసాగించి చివరకు మహిళలపై పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లు అత్యవసర సేవల క్రింద చీకటి జీఓ 2 ను తీసుకుని వచ్చి ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామని చెప్పడం దుర్మార్గపు చర్య అని వారు తెలిపారు. సమ్మెలు చేయరాదని వెంటనే విధులకు హాజరు కావాలని షరతులు పెట్టి మహిళలను వేధించడం సరైన పద్ధతి కాదని వారు విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఆలోచించి జీవో నెంబర్ 2ను రద్దుచేసి న్యాయంగా రావలసిన అంగన్వాడీల జీతాలు పెంచి న్యాయమైన కోరికలను పరిష్కారం చేసి సమ్మెను విరమింప చేయాలని వారు కోరారు. బల ప్రయోగం చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని వారు హెచ్చరించారు. దీక్ష శిబిరానికి మద్దతుగా ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి గురు శేఖర్, జిల్లా కార్యదర్శి ముక్కన్న, నగర కార్యదర్శి సి శేషాద్రిలు తమ బృందంతో వచ్చి అంగన్వాడీలకు మద్దతును తెలిపారు. ఎమ్మార్పీఎస్ కళాకారుల బృందం శిబిరం వద్దకు వచ్చి తమ పాటలతో అంగన్వాడీలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి రేణుక, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర -జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో ఈ నెల 9, 10,11 తేదీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల్లో కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి పాల్గొననున్న సందర్భంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జిల్లాలో నాలుగు చోట్ల వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈనెల 9న మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం 10న ఉదయం నందవరం మండల కేంద్రంలోనూ, మధ్యాహ్నం హెరాళగుంద మండలం గజ్జేహళ్లి లోనూ, 11న తుగ్గలి మండలం పగిడిరాయిలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.కేంద్ర మంత్రి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, బ్యాంకింగ్ రంగాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రదర్శిస్తూ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉజ్వల, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ఆయుష్మాన్ భారత్, జన ఔషధి,సాయిల్ హెల్త్ కార్డ్స్, పీఎంకిసాన్, పీఎం పోషణ్ అభియాన్, పీఎం ఆవాస్ యోజన, పీఎం కిసాన్, ప్రధానమంత్రి జన్‌ఆరోగ్య యోజన, స్వమిత్వ, జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల స్టాళ్లలో వివరించే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పి సీఈవో నాసర రెడ్డి, ఆర్డీవో హరి ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ ఈ సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, డి ఎం హెచ్ ఓ రామ గిడ్డయ్య, హౌసింగ్ పిడి సిద్ధ లింగమూర్తి, ఐసిడిఎస్ పిడి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఆదోని రూరల్: మునిసిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోట్ల సర్కిల్లో ఒంటికాలపై నిల్చొని కాంట్రాక్ట్ కార్మికులు నిరసన వ్యక్తం తెలియజేశారు. కాంట్రాక్ట్ కార్మికుల చేపట్టిన సమ్మె శనివారంతో నాలుగవ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు ఓబి నాగరాజు నాయకత్వంలో మునిసిపల్ మైదానం నుంచి బయలుదేరి కోట్ల సర్కిల్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు అజయ్ బాబు, జిల్లా సంస్థ సభ్యులు కల్లు బావి రాజు,మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులు జయరాజు,జాన్ బాబు,లక్ష్మన్న,శాంత, గుండాంజని, నరసింహులు, సుశీలమ్మ,నాగమ్మ,ఆదిలక్ష్మి, ఐసి లక్ష్మీదేవి తదితరులు మాట్లాడుతూ సమాజంలో ఎవ్వరు చేయలేని సేవలు చేస్తూ తమ ఆరోగ్యాలు క్షమిస్తున్న ప్రజల ఆరోగ్యాలు బాగుండాలని పలు రకాల సేవలు చేస్తున్న పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వ ధోరణి సరికాదన్నారు. ఎన్నికల ముందు కాంట్రాక్ట్ వ్యవస్థను చేసి ఆ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని సమాన పనికి సమాన వేతనం కల్పిస్తానని ఇచ్చిన హామీ సీఎం జగన్మోహన్ రెడ్డి మరిచారా అంటూ ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులకు కల్లబొల్లి మాటలు చెప్పి వైసీపీ గద్దెకెక్కిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని, ప్రతిపక్షంలో చేపట్టిన పాదయాత్రలో ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చాక గుద్దుల వర్షం గుప్పిస్తున్నాడని విమర్శించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో పారిశుద్ధ్య కార్మికుల పట్ల వ్యతిరేక విధానాలకు గుణపాఠం చెప్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కల్లూరు: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే పశువుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని పశుసంవర్ధకశాఖ ప్రత్యేకాధికారి జాయింట్ డైరెక్టర్ డా.లావణ్య లక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని పెద్దటే కూరులో జాతీయ పశువ్యాధి నివారణ ప్రత్యేక కార్యక్రమం చిన్నటేకూరు పశువైద్యాధికారి డా.శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లావణ్య లక్ష్మి, డా. రామచంద్రయ్య, దుర్గా ప్రసన్న బాబు, పార్థసారథి కృష్ణ కాంత్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులు గాలికుంటు వ్యాధి గురైతే ఎండ తీవ్రతను ఎదుర్కోలేక నిరసించిపోతాయని అలాగే పాడిపశువులు పాలశాతాన్ని పూర్తిగా తగ్గిస్తాయని దుక్కి దున్నే ఎద్దులు వాటి సామర్థ్యాన్ని తగ్గిపోయి అలసిపోతాయని ఇలాంటి లక్షణాలు ఉన్న పశువులను వెంటనే గుర్తించి వాటి నివారణ టీకాలు వేయిస్తే పశువుల ఆరోగ్యంగా ఉంటాయన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయిస్తే పశువులు కోలుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తాయన్నారు. మూగజీవాలను పెంచి పోషించే రైతులు తప్పనిసరిగా పశువులకు సీజన్లో వచ్చే వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. పశువులు రోగాల బారిన పడినప్పుడు సంబంధిత పశు వైద్యం సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని పశువులకు 100% రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యం అందిస్తుందని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దటేకూరు దొడ్డిపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

8న జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర -కర్నూలు: ఈనెల 8న సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

9,10న నిజం గెలవాలి
పత్తికొండ, ఎమ్మిగనూరులో భువనేశ్వరి పర్యటన

విశాలాంధ్ర-కర్నూలు: టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా గుండె ఆగి మృతి చెందిన టీడీపీ అభిమానుల కుటుంబాలను ఓదార్చేందుకు చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఈనెల 9,10 తేదీలలో పత్తికొండ, ఎమ్మిగనూరులో పర్యటిసారని జిల్లా టీడీపీ అధ్యక్షులు బీటీ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబును పోలీసులు నంద్యాలలో సెప్టెంబరు 9న అర్ధరాత్రి అక్రమంగా అరెస్టుచేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో జూడీషియల్ రిమాండ్ విధించి సుమారు 53 రోజులు ఈ ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించి, చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేని జిల్లాలో ఆయన అభిమానులు గుండె ఆగి మృతి చెందారు. ఆ కుటుంబాలను భువనేశ్వరి జిల్లాలో 9న పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలు, 10న ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో ఆమె పర్యటిస్తానారన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీశ్రేణులకు పిలుపు నిచ్చారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర- క్రిష్ణగిరి : కర్నూలు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు క్రిష్ణగిరి ఎస్ఐగా చంద్రశేఖర్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. స్థానికంగా ఎస్సైగా పనిచేస్తున్న సురేష్ ప్రస్తుతం విఆర్‌కు వెళ్లినట్లు సమాచారం. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ మండలంలో పనిచేశానని దాదాపు అన్ని విధాలుగా మండలం పై అవగాహన ఉందన్నారు. మండలంలో అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం మోపుతానని ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నిఘ ఉంచి ప్రశాంతంగా ఎన్నికల జరిగేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు మండల ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి వెళితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులపై ప్రభుత్వం కపట ప్రేమ విడాలి

విశాలాంధ్ర -ఆదోని రూరల్ : సమగ్ర శిక్ష ఉద్యోగులపై ప్రభుత్వం చూపుతున్న కపట ప్రేమను విడిచే సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. శనివారం చేపట్టిన దీక్షలో ఆయన మాట్లాడుతూ మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందిని కేజీబీవీ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. కొన్ని రాష్ట్రాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ కూడా చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంటాక్ట్ పద్ధతిలోకి మార్చడం జరిగిందని మా న్యాయమైన పరిష్కారాలను సత్వరమే పరిష్కరించారు పరిష్కరిస్తారని ఇప్పటికైనా జగనన్న పాదయాత్ర ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజు,జగదీష్, తులసి,సోమేశ్వరి,భాస్కర్, మధుమోహన్ తదితరులు ఉన్నారు.

రెండు భాషలను కొనసాగించండి

విశాలాంధ్ర - హెరాళగుంద : జిల్లా పరిషత్ హైస్కూల్లో సి.బి.ఎస్.ఇ సిలబస్ ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని కన్నడ సంఘం నాయకులు రుద్రగౌడ్ వార్డు మెంబర్లు హమీద్ సుభాన్ అబ్దుల్ రెహమాన్ విద్యార్థుల తల్లి దండ్రులు ఆరోపించారు. జడ్పీ హైస్కూల్లో దాత వెంకట శివప్రసాద్ ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన డీఈఓ రంగారెడ్డికి వార్డు మెంబర్లు కన్నడ సంఘం నాయకులు ప్రజలు వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా కన్నడ సంఘం నాయకులు రుద్ర గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలు ముగింపు దశలో ఉన్నాయని అలాంటప్పుడు సిపిఎస్ఇ ప్రవేశ పెట్టడం వల్ల విద్యార్థుల విద్యాబోధనకు ఆటంకం కలిగిందన్నారు. వెంటనే సిబిఎస్ ఈ సిలబస్ను రద్దుచేసి కన్నడ ఉర్దూ భాషలలో బోధన విద్యా బోధన కొనసాగించాలని డిమాండ్ చేశారు .ఎన్నో ఏళ్ల నుండి కన్నడ ఉర్దూ భాషలో చదువుతున్న విద్యార్థులకు సి బీ ఎస్ ఈ సిలబస్ ప్రవేశపెట్టినందున విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని విద్యార్థుల తల్లి దండ్రులు పేర్కొన్నారు. కన్నడ ఉర్దూల భాషలను కొనసాగిస్తే పిల్లల చదువు ఎలాంటిఆటంకం లేకుండా కొనసాగుతుందని స్పష్టం చేశారు. డివో రంగారెడ్డి మాట్లాడుతూ కన్నడ, ఉర్దూ మీడియం లో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని తగిన న్యాయంచేసేందుకు యత్నిస్తానన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పత్తికొండ: బీసీ సంక్షేమ సంఘం 2024 నూతన క్యాలెండర్ ను అర్బన్ సీఐ మురళీమోహన్, మాజీ సర్పంచ్ సోమశేఖర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆస్పరి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నాగరాజు, గంగన్న, కారుమంచి నజీర్, రామచంద్ర, మోహన్, మధు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

స్వామినాథ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య

విశాలాంధ్ర– బనగానపల్లె: స్వామినాథ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా ప్రథమ మహాసభ బనగానపల్లెలోని నూకల రెసిడెన్సి ఫంక్షన్ హాల్‌లో జిల్లా రైతు సంఘం నాయకులు నారాయణ, సోమన్న, వెంకటశివుడు, సుబ్బారెడ్డిల అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే రామాంజనేయులు, ఉమ్మడి జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి భీమ లింగప్ప, నంద్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రంగ నాయుడు, నంద్యాల జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సిపిఐ కార్యవర్గ సభ్యులు భాస్కర్, రైతు సంఘం నాయకులు నరసింహులు, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు.ముందుగా పట్టణంలోని జిఎం టాకీస్ కూడలి నందు ర్యాలీగా బయలుదేరి పెట్రోల్ బంక్ సర్కిల్ నూకుల రెసిడెన్సి చేరుకొని ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య మాట్లాడుతూ దేశ సంపన్ను సృష్టించి రెండు వర్గాలు పారిశ్రామిక రంగం వ్యవసాయ రంగం అన్నారు. నేడు అన్నం పెట్టే రైతన్న ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి ప్రధాన కారణం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించడం కోసం కేంద్ర ప్రభుత్వం స్వామినాథ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని స్వామినాథ కమిటీ దేశమంతటా తిరిగి రైతుల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని దానిలో ప్రధానమైన సమస్యలు రైతుల ఆత్మహత్యలు నివారించడం కోసం పంట రుణాలు మాఫీ చేయాలని, మద్దతు ధర, ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వం స్వామినాథ కమిటీ సిఫార్సులు అమలుపరిస్తే దేశంలో ఆర్థిక సంక్షోభం వస్తాదన్నడం రైతుల పట్ల ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందన్నారు. అదేవిధంగా ఆర్థిక సంక్షోభం పెద్ద పెద్ద పారిశ్రామిక వ్యక్తులకు రాయితీలు కల్పించినప్పుడు అడ్డు రాలేదా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నంద్యాల జిల్లా వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించిందని తెలిపారు. నెల్లూరు జిల్లా , మద్రాసు రాష్ట్రాలకు మన పోతిరెడ్డిపాడు నీరు తరలిస్తున్నామని పేర్కొన్నారు. సిపిఐ పార్టీ ఆనాడు చేసిన కృషి వల్ల రైతు సంక్షేమం కోసం కీర్తిశేషులు నందమూరి తారక రామారావు ప్రధానమైన కాలువలు నిర్మించి రైతుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. అదేవిధంగా సిద్దేశ్వరం వద్ద చెక్ డాం నిర్మిస్తే నీరు నిల్వ ఉండి వ్యవసాయంగానికి ఉపయోగపడతాయని రైతుల పక్షాన పోరాటం చేసిన రైతు సంఘం నాయకుడు బొజ్జ దశరథ రామిరెడ్డి అరెస్టు చేయడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సిగ్గుచేటు అన్నారు. దద్దనాల చెరువుకు నీరు నింపడం కోసం బీసీ జనార్దన్ రెడ్డి ఎత్తి పోతుల పథకం ఏర్పాటు చేశారని కానీ హంద్రీనీవా ద్వారా నీరు మళ్ళించే ఏర్పాటు చేయాలన్నారు. నంద్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా పేరుతో 12500 రైతులకు నగదు జమ చేస్తానని మోసం చేసి విడుదల వారీగా ఇవ్వడం రైతు సోదరులు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 406 మండలాల్లో కరువు సంభవిస్తే కేవలం 106 మండలాల్లో కరువు ఉన్నట్లు గుర్తించడం రైతులకు అన్యాయం చేసినట్లు అని పేర్కొన్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో కేవలం 6 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారని విమర్శించారు. కరువు మండలాల్లో ఎకరాకు 30000 నగదు చెల్లించాలన్నారు. నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి నకిలీ విత్తనాలు ఏదేచ్ఛగా విక్రయిస్తున్నారని ముఖ్యమంత్రి చోద్యం చేస్తున్నారని విమర్శించారు. పాణ్యం ఎమ్మెల్యే , బనగానపల్లె ఎమ్మెల్యే పరిశ్రమల కోసం తక్కువ ధరకు రైతుల భూములు ఇప్పించారని విమర్శించారు.తక్షణమే సిద్దేశ్వరం వద్ద చెక్ డాం నిర్మించి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.ందర్భంగా ప్రజానాట్యమండలి శివయ్య, వాసు విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హిమావులు, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు సంజీవులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య, సహాయ కార్యదర్శి వాసు, ఏఐటీయూసీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ శివ బాలకృష్ణ,కుళాయి స్వామి, సుబ్బయ్య, రవి, ఆశీర్వాదం, సిపిఐ బేతంచెర్ల మండల కార్యదర్శి భార్గవ, సూర్యనారాయణ, మద్దిలేటి, ఆశీర్వాదం, వెంకటలక్ష్మి, రామ లచ్చమ్మ, రైతులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పింఛన్.... మురిపించెన్

విశాలాంధ్ర –అవుకు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథంలోని ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ 3000 రూపాయలకు పెంచడంతో పింఛన్ దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని చాకలిపేటలో నివాసముంటున్న చాకలి చిన్న నాగమ్మకు వాలంటరీ మహబూబ్ బాషా 3 వేల రూపాయల పింఛన్ అందిం చడంతో ఆనందంతో కృతజ్ఞతలు తెలిపింది. ఎన్నికల హామీలో భాగంగా 2000 రూపాయలు ఉన్న పింఛన్ ను విడతల వారిగా పెంచుతూ 3000 రూపాయలు చేస్తామని హామీ ఇచ్చిన విధంగానే నేడు 3000 రూపాయలను అందించడం జరిగిందని వాలంటరీ మహబూబాషా తెలి పారు. పింఛన్ అందుకున్న చాకలి చిన్న నాగమ్మ మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్ద కొడుకు లాగా ప్రతి నెల ఒకటో తారీఖున ఉదయమే వాలంటరీల ద్వారా పింఛన్ అందిస్తున్నారని పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాల అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్ రెడ్డికి, శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాముడి అక్షింతలు పంపిణీ..

విశాలాంధ్ర – వెల్దుర్తి : ఈనెల 22వ తేదిన శ్రీరామ జన్మభూమి అయినటువంటిఆయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంజరుగుతున్నందున దేశంలోని ప్రతి ఇంటికి అయోధ్య నుండి వచ్చిన రాములోరి ఆక్షింతలను మండల పరిధిలోని రాముళ్ళకోట గ్రామంలోని ప్రతి ఇంటికి పంపిణీ చేసినట్లు గ్రామ పెద్దలు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి,రామకృష్ణఆచారి, చంద్రశేఖరరెడ్డి, మంచిరెడ్డి శశి, సీతారాముడు, బీటి.నాయుడు గ్రామ పెద్దలు శనివారం పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర – వెల్దుర్తి : రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించి కొత్త ఒరవడి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్ కే దక్కిందని ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో రూ.3వేలకు పెంచిన వైయస్ఆర్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల శైలజ, జడ్పిటిసి సుంకన్న, బ్రహ్మ గుండం చైర్మన్ పెద్దిరెడ్డి పట్టణ ప్రెసిడెంట్ వెంకటనాయుడు, ఎస్సిసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అగస్టీన్, మార్కెట్ మార్డు డైరెక్టర్ గట్టు ఆరీఫ్, మాజీ సర్పంచ్ అవుల వెంకటేష్, ఎంపిటిసిలు, వార్డుమెంబర్లు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై ఎమ్మెల్యేకు వినతి..

విశాలాంధ్ర – వెల్దుర్తి : రాష్ట్రంలోని అంగన్వాడిల సమస్యలను పరిష్క రించాలని కోరుతూ 26 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా శని వారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కె.శ్రీదేవికి అంగన్వాడి వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ యూనియన్ నాయకురాలు న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పిం చారు. సమ్మె కొరకు వస్తూ మండల పరిధిలోని లింగాపల్లె గ్రామానికి చెందిన అంగన్వాడి హెల్పర్ దస్తగీరమ్మ బైక్ పై నుండి కిందపడి తీవ్రంగా గాయా లాపాలైంది. ఆమెకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరా రు.అంగన్వాడీలు చేస్తున్న నిరసన సమ్మె శనివారం నాటికి 26వ రోజు కు చేరుకుంది. ఈసందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద అంగన్వాడీలు నిరసన సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఐ క్రిష్ణగిరి మండల సహాయ కార్యదర్శి బొంతిరాళ్ళ సర్పంచ్, న్యా యవాది రవిమోహన్ నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమం లో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బి.మాధవస్వామి, క్రిష్ణగిరి, వెల్దు ర్తి ప్రాజెక్ట్ ఎస్.చాందినీ, ఈదమ్మ, బి.వరలక్ష్మి, బి. వెంకటలక్ష్మి, హెప్సి బా,మాబున్నిలు పాల్గొన్నారు.

సైకో పాలన నుంచి కాపాడుకుందాం..!

విశాలాంధ్ర –డోన్ : నాలుగేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకా లని ,మన రాష్ట్రాన్ని ఈ సైకో పాలన నుంచి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని డోన్ నియోజకవర్గ టీడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. శనివారం సుబ్బారెడ్డి విలేకరు లతో మాట్లాడుతూ అవినీతిఅరాచక పాలనను అంతమందిచడం మ నందరి బాధ్యతన్నారు. రా కదలి రా కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్య పరచి సైకో జగన్ ప్రజలను ఎలా లూటీ చేశారో వివరించాల న్నారు. కులాల పేరుతో ప్రజలను విడగొట్టి మరల సిఎం కుర్చీ ఎక్కా లని చూస్తున్నారని, ఈ వైసిపి ప్రభుత్వంలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు దగా పడ్డారన్నారు. రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలకు మానప్రాణాలకు భద్రత లే కుండ పోయిందని, ప్రభుత్వం, ప్రైవేట్ భూములు అనుకోకుండా కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీల కు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కల్పించేందుకు "జయహో బీసీ" తో ప్రజల ముందుకు వచ్చిందని, బీసీలు బలహీనులు కాదు, బలవంతులనే నినాదమే తెలుగుదేశంపార్టీ సిద్ధాంతం అని అన్నారు.. ఈనెల 29 వరకు మొత్తం 22పార్లమెంట్ స్థానాల్లో చంద్రబాబు బహిరంగ సభలు నిర్వహిస్తున్నామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

విశాలాంధ్ర –అవుకు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న జగనన్న రీసర్వేతో భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభించ ను న్నదని తహసీల్దార్ పూతల ప్రసాద్‌బాబు అన్నారు. మండలంలోని శివ వరంలో శనివారం రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. ఈ సంద ర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శివవరం గ్రామంలో రీ సర్వే పూర్తి అయిందని రైతులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. తమపరిధిలో పరిష్కారం కాని సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేం దుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రాముడు, మండల సర్వేయర్, వీఆర్వో హైదర్ రైతులు పాల్గొన్నారు.

సమ్మెపై ఏస్మా చట్టం విధించడం తీవ్రంగా ఖండిస్తున్నాం

విశాలాంధ్ర– కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్లలో శని వారం అంగన్వాడీల సమ్మెకు ప్రజా సంఘాలు మద్దతు పలుకాయి.ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ గత 26 రోజులుగా అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా వారి న్యాయమైన కోరికలు పరిష్కారం చేయాలని న్యాయబద్ధంగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఎస్మా చట్టం విధించి జీవో నెంబర్ 2 ను విడుదల చేయడం సిపిఎం పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నాం అని సిపిఎం జిల్లా నాయకులు ఏం సుధాకర్ అన్నారు.కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి, సరస్వతి మరియు ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర – బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని పొదుపు భవనంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ మండలంలో 12,852 మంది లబ్ధిదారులకు రూ.3.86 కోట్ల పెన్షన్ పంపిణీ చేస్తున్న పేర్కొన్నారు.

ఎస్మా చట్టం ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య

విశాలాంధ్ర –ఆళ్లగడ్డ: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం చే యాలని పోరాటం చేస్తుంటే అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య అని ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ ఇంచార్జ్ ఇరిగెల రాంపుల్లారెడ్డి రెడ్డి, జనసేన అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గత 26 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు అత్య వసర సేవలంటూ ఎస్మా ప్రయోగించడం సిగ్గుచేటన్నారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు -వైసీపీ యువనేత ప్రదీప్ రెడ్డి

విశాలాంధ్ర – పెద్దకడబూరు : అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పెద్దకడబూరు గ్రామంలోని సచివాలయం – 1 పరిధిలో మూడవ రోజు గ్రామ సర్పంచ్ రామాంజ నేయులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డితోపాటు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సచివాల య జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, మాజీ రఘురామ్, వైసీపీ నాయకులు గజేంద్రరెడ్డి, పూజారి ఈరన్న, శివ రామిరెడ్డి, విజేయేంద్రరెడ్డి, నవీన్ రెడ్డి, తిక్కన్న, ముక్క రన్న, అర్లప్ప ప్రతి గడపకు వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొని రావాలని, తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దేశ చరిత్రలోనే అర్హులైన వారందరికీ రాజకీయాలకు అతీతంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే సంక్షేమ ఫలాలను జమ చేయడం ఒక్క ఏపీలో జరుగుతుందన్నారు. అందులోనూ మహిళా సాధికారత కోసం ప్రతి పథకం మహిళలకే అందేలా కృషి చేశారని గుర్తు చేశారు. టీడీపీ మరోమారు ఆరు గ్యారెంటీలు పేరుతో మీ ముందుకు వస్తుందని, ఇచ్చిన మాట మీద నిలబడే వ్యక్తిత్వం చంద్రబాబుకు లేదని, ఆరు గ్యారెంటీలను నమ్మి మరోమారు మోసపోవద్దని కోరారు. మీ వెన్నంటి ఉండే బాలనాగిరెడ్డిని మరోమారు మంత్రాలయం ఎమ్మెల్యేగా, జగన్ ను మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్ ను దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ జనార్దన్, ఆర్ఐ మహేష్, ఏఈ లు మల్లయ్య, సాయి కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ రెండును రద్దు చేయాలి-అంగన్వాడీల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర–జూపాడుబంగ్లా : మండలంలో అంగన్వాడీలు వేతనాలు పెంచాలని పలు డిమాండ్ తో సమ్మెలో భాగంగా 26వ రోజు మండల కేంద్రంలోని స్థానిక తాసిల్దార్ ఆఫీస్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియు ఆధ్వర్యంలో జీవో నెంబర్ 2 ను తక్షణమే రద్దు చేయాలి అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు .ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం. కర్ణ ,సిఐటియు నాయకురాలు పద్మావతి హాజరయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడిల సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని 26 రోజులుగా సమ్మె చేస్తూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని వేడుకుంటున్న మాపై కనికిరం చూపకుండా మాపై లాటిలు చూపిస్తూ జైల్లో పెడుతూ శనివారం నుండి సమ్మె చేయకూడదు అని ఎస్మా జీవో నెంబర్ రెండును రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై వారు తీవ్రంగా మండిపడ్డారు. అంగన్వాడీలపై బెదిరింపులకు భయభ్రాంతులకు గురి చేయకుండా అంగన్వాడి సమస్యలు తక్షణమే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు .లేనిపక్షంలో ప్రజా సంఘాలను స్వచ్ఛంద సంస్థలను కళాకారులను మేధావులను అందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున అంగన్వాడి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమిస్తామని వారు ప్రభుత్వాని హెచ్చరించారు. అనంతరం జీవో నెంబర్ 2 కాపీని దగ్ధం చేశారు .ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల అంగన్వాడీ వర్కర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం కష్టపడే నాయకుడు సీఎం జగన్

విశాలాంధ్ర–అవుకు: ప్రజల కోసం కష్టపడే నాయకుడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో వైఎస్ఆర్ నూతన పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో 6,919 మంది లబ్ధిదారులకు రూ.2.075కోట్లను అందిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని ఈసందర్భంగా వారు గుర్తు చేశారు.2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్నే గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు.కార్యక్రమంలో సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, పట్టణ సర్పంచ్ మంద గురమ్మ, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, మెట్టుపల్లి ఉప సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు కునుకుంట్ల రామన్న, రామవరం సర్పంచ్ మనోహర్, పురుషోత్తమ నాయుడు, సచివాలయ ఉద్యోగులు, వాలంటరీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర – పెద్దకడబూరు : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాస్కర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కుమ్మరి చంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలకు 15 రోజుల కొక్కసారి ఇవ్వవలసిన వేతనాలను 3 నెలల గడచినా కూలీల ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఇతర శాఖలకు మళ్లించడం విచారకరమన్నారు. కూలీలకు పనులు లేక ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళు తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీడీ స్పందించి తక్షణమే కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను ప్రారంభించాలని డిమాండ్. మస్టర్లలో బినామీ పేర్లను నమోదు చేసుకొని దర్జాగా ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, సిపిఐ సీనియర్ నాయకులు మాబు హుస్సేన్, నాగరాజు, మారెన్న, చిన్నోడు,పెద్దన్న, బాబు, రామాంజిని, నర్సింహులు, చిన్నన్న, భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న పంప్ హౌస్

విశాలాంధ్ర –హొళగుంద : హొళగుంద గ్రామపంచాయతీ ప్రజలకు త్రాగునీటి నీటి సరఫరా చేసే పంప్ హౌస్ శిథిలావస్థకు చేరుకుంది. విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి దీనివల్ల ప్రమాదం జరగవచ్చని వాటర్ మ్యాన్లు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ వైర్లు పంప్ హౌస్ లోని నీటిలో నానుతున్నాయని అకస్మాత్తుగా ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. ప్రతిరోజు ప్రజలకు త్రాగునీటి సరఫరా చేయడానికి వాటర్ మిలన్ గోపాల్ ,రమేష్ విధులు నిర్వహిస్తున్నారు. ఇరుకు గదుల్లో విద్యుత్ బోర్డులు విద్యుత్ మోటర్లు పైపులు ఉన్నాయి. గత 30 ఏళ్ల క్రితం నిర్మించారు శిథిలావస్థకు చేరడంతో వర్షానికి కారుతుందని ప్రజలు వాపోయారు. విద్యుత్తు తీగలు అడ్డుదిడ్డంగా వేలాడుతున్నాయని తీగలు ప్రమాదకరంగా మారిన అధి కారులు పట్టించుకోవడం విశేషం. పంప్ హౌస్ కొత్తగా నిర్మించా లంటూ అధికారులకు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని నూతన పంప్ హౌస్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.